వందనోటు

వేదుల వేంకట రమణమూర్తి

"కరెక్ట్ టైంకు రోజూ ఆఫీసుకి వెళ్ళామని ఎంత ప్రయత్నించినా అవ్వదు రోజూ ఏదో ఒక ఆటంకం కలగడం ఆఫీసుకి లేటుగా వెళ్ళడం అయిపోతోంది అక్కడకు వెళ్ళాక ఆఫీసరుకి అడ్డమైన సాకులు చెప్పాల్సి వస్తోంది ఛీ! ఛీ! వెధవ బ్రతుకు" తనలో తనే విసుక్కుంటూ ఆఫీసుకి తయారవుతున్నాడు శ్రీనివాసరావు టైం చూసుకున్నాడు తొమ్మిదీ నలభై

ఆఫీసుకి బయల్దేరబోతూ అలవాటు ప్రకారంగా ఆఫీసు తాళాలు, రుమాలు, పర్సులో డబ్బులు వున్నాయో లేవో చూసుకున్నాడు 'అరే! యిందులో రెండొందల రూపాయలుండాలి వందే వుందేమిటి చెప్మా, ఏమిటీ నిన్న ఖర్చు చేయలేదే అవును నిన్న సాయంకాలం ఆఫీసు నుండి యింటి కొచ్చే ముందు కూడా చూసాను. వంద నోట్లు రెండుండేవి. యిప్పుడు ఒక్కటే వుంది" అనుకుంటూ జేబులన్నీ వెదికాడు కనిపించక పోయేసరికి,

"ఏమేవ్! నా పర్సులో డబ్బులు గాని తీసావా?" భార్యను కేకేసాడు శ్రీనివాసరావు

"ఇంత వుదయాన్నే నాకేమిటవసరం, నేనేమీ తీయలేదండీ, అయినా ఎంత వుండాలందులో" వంటింట్లోంచి వస్తూనే అంది శారద

"రెండు వంద రూపాయల నోట్లు పెట్టానిందులో, యిప్పుడు చూస్తే ఒకటే వుంది మరోటి ఏమైనట్టు?" భార్య కూడా తీయలేదనే సరికి గుండెలో రాయి పడింది శ్రీనివాసరావుకి

"సరిగ్గా గుర్తు తెచ్చుకోండి మర్చిపోయి యింకెక్కడైనా పెట్టేసి వుంటారు.

నీ మొహం! మర్చి పోవడమేమిటి? నిన్న మధ్యాహ్నం నువ్వే కదా చూసావ్, రెండొంద లుండేవా నిన్నంతా నేనేమీ ఖర్చే చేయలేదు అదీ కాక నిన్న సాయంత్రం యింటి కొచ్చే ముందు కూడా చూసాను నాకు బాగా గుర్తు'

"పోనీ! పెద్దబ్బాయి నడగండి తీసేడేమో!" అంది శారద

"వాడెందుకు తీస్తాడే నిక్షేపంలా వాడు వుద్యోగం చేస్తుంటే. అయినా నన్నడక్కుండా వాడలా తీయడు ఒకవేళ తీసుంటే మిగిలిన యిద్దరిలో ఎవడో ఒకడు తీసుంటాడు" అన్నాడు శ్రీనివాసరావు సాలోచనగా

'ఒరేయ్! బుచ్చి!. చంటీ!.." కేకేసాడు శ్రీనివాసరావు పక్క గదిలో స్కూలుకి తయారవుతున్న పిల్లలిద్దరూ తండ్రి పిలుపుకి గదిలోకి వచ్చారు

"ఎందుకు నాన్నా పిలిచారు"

"నా పర్సులో డబ్బులు ఎవరు తీసారా?" అడిగాడు శ్రీనివాసరావు.

'నాకు తెలియదు నాన్నగారూ!' యిద్దరూ ఒకేసారి అన్నారు

"నిజం చెప్పండి! మెల్లగా అడుగుతున్నాను. అబద్ధం ఆడేరంటే మాత్రం వూరుకునేది లేదు! చెప్పండి!" మెల్లగా అన్నా గంభీరంగా అన్నాడు శ్రీనివాసరావు

"నిజంగా నాన్నగారూ! నేనేమీ తీయలేదు భయ భయంగా అన్నాడు తొమ్మిదో తరగతి చదువుతున్న బుచ్చి

"నువ్వు?" చంటి వేపు తిరిగి అడిగేడు శ్రీనివాసరావు.

"నాకెందుకు నాన్నగారూ! అడిగితే మీరే యిస్తారుగా! నిజంగా నేనూ తీయలేదు బిక్కమొహం వేసి అన్నాడు ఏడవ తరగతి చదువుతున్న చంటి

"చూడండి! ఇంట్లో వున్నది మనమే! ఇంకెవ్వరూ రాలేదు అన్నయ్య వుద్యోగం చేసుకుంటున్నాడు కాబట్టి వాడికి తీయాల్సిన అవసరం లేదు, అమ్మ కూడా తీయలేదు ఇంకెవరు తీస్తారు ఇకపోతే మీ యిద్దరూ మీ యిద్దరిలో ఎవరో ఒకరు తీసి వుండాలి. ఆఖరి సారిగా అడుగుతున్నాను చెప్పారా సరే సరి! లేకపోతే ' అంటూ బెల్టు బయటికి తీసాడు శ్రీనివాసరావు.

బెల్టుని చూస్తూనే వులిక్కి పడ్డారిద్దరూ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు 'నాన్నగారండీ! కొట్టకండి! నిజంగా చెబుతున్నానండి నేను తీయలేదండి ప్రాధేయ పడుతూ అన్నాడు బుచ్చి

నాన్నగారూ! నిజంగా నేనూ తీయలేదండి నన్ను వదిలేయండి అన్నాడు చంటి ఏ క్షణంలో బెల్టు దెబ్బ మీద పడుతుందోనని భయ భయంగా చూస్తూ

శ్రీనివాసరావు కళ్ళు ఎరుపెక్కాయి బెల్టు పట్టుకున్న చేయి బిగుసుకుంది బెల్టుకి చలనం వచ్చింది. ఒకటి. రెండు మూడు. బెల్టు పిల్లల చర్మాలను తీవ్రంగా తాకుతోంది.

"వద్దండీ! వాళ్ళను కొట్టకండి.. నిజంగా వాళ్ళు తీయలేదేమోనండీ" శారదలోని మాతృ హృదయం తీవ్రమైన బాధకి గురవుతోంది. భార్య మాటలు చెవికెక్కడం లేదు శ్రీనివాసరావు అపర నరసింహావతారం ఎత్తాడు

'నాన్నగారండీ. కొట్టకండి. నిజమండీ. నేను తీయనే లేదండీ. నాన్న." పిల్లల అర్థింపు లెక్కడా వినే స్థితిలో లేడు.

ఫ్రెండ్ దగ్గర ఏదో పనుందని వెళ్ళిన పెద్ద కొడుకు కుమార్ యింట్లోకి అడుగు పెడుతూనే అక్కడి దృశ్యాన్ని చూసి "నాన్నగారూ! ఆగండి! ఏమైంది?, ఎందుకు వాళ్ళనలా కొడుతున్నారు? ఏం చేసారు వాళ్ళు? చెప్పండి?" ఆతృతగా, ఆవేదనగా అడిగాడు

'చూడరా! వీళ్ళు ఏదడిగితే అది యిస్తూ ముద్దుగా చూస్తుంటే యీ రోజు నా పర్సులో వంద రూపాయలు కాజేసారు పైపెచ్చు తీయలేదని దబా యిస్తున్నారు' అంటూ రొప్పుతూ మరో దెబ్బ వేయబోయాడు శ్రీనివాసరావు

'ఓ మై గాడ్! నాన్నగారూ! ఆగండి! మీ పర్సులోంచి వంద రూపాయలు నేను తీసాను " కొట్టబోతున్న తండ్రి చేయి పట్టుకుని ఆపాడు కుమార్

ఆ మాట విన్న శ్రీనివాసరావు నిశ్చేష్టుడై పోయాడు చేత లుడిగిన వాడిలా కళ్ళప్పగించి నిల్చుంది



పోయాడు అంతవరకు కొట్టి కొట్టి అలసి పోయిన, బెల్టు, చేతిలోంచి జారి కింద పడింది

"అవును నాన్నగారూ! నేనే తీసాను ఈ రోజు వుదయాన్నే మా ఫ్రెండ్‌కి అర్జంటుగా మూడొందలు కావల్సి వచ్చింది నా దగ్గర రెండొంద లుంటే మరో వంద కోసమని మిమ్మల్ని అడుగుదామను కున్నాను. మీరు బాత్రూంలో వున్నారు తరువాత మీకు చెప్పొచ్చు అనుకుని వంద నోటు మీ పర్సులోంచి తీసి మా ఫ్రెండ్ కిచ్చి వస్తున్నాను నేనిప్పుడు అక్కడి నుంచే వస్తున్నాను కానీ నేను మీకు చెప్పేలోగా . మీరు యింత పని చేసారు " అంటూ తమ్ముళ్ళ వైపు తిరిగి 'ఏ పాపం ఎరుగని వీళ్ళని అనవసరంగా కొట్టారు చూడండి ఎలా తేట్లు తేలాయో అయినా యింట్లో వున్న అందరినీ అడక్కుండా ఎందుకింత తొందర పని చేయడం? అంటూ తన బాధను, కించిత్ కోపాన్ని తండ్రి ముందు వ్యక్తం చేసాడు కుమార్

ఎంతపని చేసానురా! నువ్వు తీసుంటావని అమ్మ చెప్తున్నా వినిపించుకో లేదు అయినా నువ్వు తీస్తావని కలలో కూడా వూహించ లేదు," అంటూ చిన్న పిల్ల లిద్దర్నీ దగ్గరకు తీసుకుని బుచ్చీ! చంటీ! అనవసరంగా నిర్దాక్షిణ్యంగా మిమ్మల్నిద్దర్నీ కొట్టేసాను బాబూ! మీరు మనసులో నా మీదెంత కోపాన్ని పెంచుకుంటున్నారో మణిపూసల్లాంటి మిమ్మల్ని అనుమానించాను మళ్ళీ ఎప్పుడూ యిలా కొట్టను లెండి నా తొందరపాటు యింత పని చేసింది" పశ్చాత్తాపం పడుతున్న శ్రీనివాసరావుకి అప్రయత్నంగా కళ్ళ నీళ్ళు వచ్చేసాయి

ఈ వేమన పద్యాలు



మాటతెల్లగల్ల మనసెల్ల మతిదొంగ
యేటి ప్రాణమింక నేటి నిజము
మాట సత్యమైన మనూశతాయుష్యంబు
విశ్వదాభిరామ వినురవేమ.

విషయం తెలిసిన శారదమ్మ కూడా ఎల్లల్నిద్దరినీ దగ్గరకు చేర్చుకొనే, ముద్దాడి వాళ్ళని ఓదార్చింది

శ్రీనివాసరావు అన్యమనస్కంగా ఆఫీసుకి బయలు దేరాడు దారిలో తను చేసిన తొందరపాటు పనికి తిట్టుకుంటూ ఆఫీసుకి చేరుకున్నాడు

రిజిష్టరులో సంతకం చేసి ముభావంగా సీట్లో కూర్చొని ఫైళ్ళు తీయ బోయాడు

నమస్కారం! శ్రీనివాసరావు గారూ! పలక రించాడు కొలీగ్ కృష్ణారావు

నమస్కారం! బుర్రెత్తకుండానే ముబావంగా సమాధానం చెప్పాడు

ఏమిటీ, యీ రోజు చాల సీరియస్‌గా కనిపిస్తున్నారు

వందనోటు

'ఏమీ లేదు ఏదో అలా చెప్పటానికి యిష్టం లేక వూరుకున్నాడు

సర్లెండి! మీ స్వంత విషయాలు నా కెందుకు, ఇవిగో మీరు నిన్న సాయంత్రం నా కిచ్చిన వంద రూపాయలూ సరియైన టైంలో ఆదుకున్నారు నిజంగా మీ మేలు మర్చి పోను మెనీ మెనీ థాంక్స్!' అంటూ వంద రూపాయలు శ్రీనివాసరావు చేతిలో పెట్టి వెళ్ళి పోయాడు కృష్ణారావు

అంతే! మరోసారి తల తిరిగి నట్లయింది శ్రీనివాసరావుకి అచేతనంగా చాలాసేపు వుండి పోయాడు అవును! నిజమే! నిన్న సాయంత్రం అర్జంటు అవసరం వుందంటే కృష్ణారావుకి వంద రూపాయ లిచ్చాను, అదే అతడు యిప్పుడు వాపసు యిచ్చాడు మరి మరి కుమార్ నా పర్సులోంచి వంద తీసానన్నాడు అదెక్కడిది వున్నవి రెండొందలే కదా! అలా ఆలోచిస్తున్న శ్రీనివాసరావుకి అంతా అగమ్య గోచరంలా వుంది ఎంత బుర్ర కొట్టుకున్నా అర్థం కావడం లేదు ఇదేదో యింటి కెళ్ళి తెలుసు కోవాలని, పర్మిషన్ తీసుకుని యింటి ముఖం పట్టాడు

ఆలోచిస్తూ యిల్లు చేరుకుని గదిలోకి అడుగు పెట్టబోతూ ఆగిపోయాడు! గదిలో నుండి పెద్దబ్బాయి బుచ్చి, చంటీలతో అంటున్న మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి

చూడండి! నాన్నగారు మిమ్మల్నిద్దరిని ఎంతగానో కొడుతుంటే అది చూసి చాల బాధని పించి నేనే ఆ వంద నోటును తీసానని అబద్ధం చెప్పాను నేను తీసానని తెలిస్తే నాన్నగారు నన్ను ఏమీ అనరని అప్పటికప్పుడు కట్టుకథ అల్లి చెప్పాను నిజానికి నేనూ ఆ డబ్బు తీయలేదు పాపం! నిజంగానే నాన్నగారి డబ్బులు పోయాయి చూడండి! మిమ్మల్ని నేను కొట్టను

కానీ నాకు నిజం తెలియాలి మీలో నిజంగా ఎవరైనా ఆ డబ్బు తీసి వుంటే చెప్పేయండి మీరు తీసినట్లుగా మళ్ళీ నేను నాన్నగార్కి చెప్పను దొంగతనం చేయడం చాలా నీచమైన పని అందులోనూ నాన్నగారు ఎంతో కష్టపడి సంపాదించి మిమ్మల్ని చదివిస్తున్నారు నాన్నగారి జేబులో నుండి డబ్బులు తీయడం తప్పుకాదా? నేను యిలా అబద్ధం చెప్పానని నాన్నగార్కి తెలిస్తే, నా మీద ఎంత కోప్పడతారో తెలుసా? మిమ్మల్ని యిలాటి దొంగపనులు చేయడానికి ప్రోత్సహిస్తున్నానని అంటారు చెప్పండి ఎవరు తీసారు?' బుచ్చి, చంటీలను సముదాయిస్తూ విషయం రాబట్టటాన్నికి ప్రయత్నిస్తున్నాడు కుమార్

"నిజంగా అన్నయ్యా! నేనా డబ్బులు తీయ లేదు బుచ్చీ చంటీ అంటూ ఎదురుగా శ్రీనివాసరావుని చూసి ఆశ్చర్యంతో చూస్తుండి పోయారు తండ్రిని చూసి కుమార్ కూడా కొయ్యబారి పోయాడు

కానీ ఆ మాటలు విన్న శ్రీనివాసరావుకి తన పిల్లల్లో వున్న సత్ప్రవర్తన, నిజాయితీలకు చలించి పోయాడు

అవును కుమార్! నిజంగా నా డబ్బు ఎవ్వరూ తీయ లేదు నిన్న సాయంత్రం ఆపీసు నుండి వస్తుంటే నా కొలీగ్ ఆ డబ్బడిగి తీసుకున్నాడు ఇప్పుడే నాకిది తెలిసింది నా మతిమరుపు యీ రోజు ఎవ్వరికీ మనశ్శాంతి లేకుండా చేసింది ' అంటూ చిన్న వాళ్ళిద్దరి వైపు తిరిగి,

బుచ్చీ! చంటి! ఇవాళ మనమంతా కలిసి హాయిగా సాయంత్రం సినిమాకు వెళ్ళిపోదాం" అన్నాడు శ్రీనివాసరావు వాళ్ళను సంతోష పరచడానికి

అసలు నిజం తెలిసి నందుకు అందరి కళ్ళల్లోనూ ఆనందంతో కొత్త వెలుగు నింపుకుంది □